క్లుప్తంగా

సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కవితల పోటీలు

రామన్నపేట: తెలంగాణ సాహితీ సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సంస్థ ఆధ్వర్యంలో 25సంవత్సరాల లోపు యువతీ, యువకులకు కవితల పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, అధ్యక్ష, కార్యదర్శులు కుకుడాల గోవర్ధన్, డాక్టర్ మహ్మద్ హసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక పరిస్థితులు, మానవీయ విలువలు, స్నేహం వంటి అంశాలపై రాసే కవితలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు తమ కవితలను ఈ నెల 20వ తేదీలోగా 9848228004 నంబర్‌కు వాట్సాప్ చేయాలని విజేతలకు నవంబర్ 3న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

రాజాపేట : మండలంలోని కాల్వపల్లి వాగు రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కాగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నాయకుడు బుడిగె పెంటయ్య గౌడ్ తమ అనుచరులతో కలిసి రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పరిశీలించారు. అనంతరం జేసీబీ తీసుకుని వచ్చి రోడ్డుపై ఏర్పడిన గుంతను వేయించారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజాపేట : మండలంలోని పారుపల్లి గ్రామంలో మంగళవారం జై భీమ్ యూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షులుగా భూపతి బాలకిషన్, రామచందర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పరమేష్, సయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా రాజు, సలహాదారుగా మహేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఎమ్మార్పీఎస్ నాయకుడు మోత్కుపల్లి నవీన్ అభినందించారు.


సభను జయప్రదం చేయాలి

బొమ్మలరామారం(తుర్కపల్లి) : తుర్కపల్లి మండల కేంద్రంలో నిర ఈ నెల 17న నిర్వహించనున్న సీపీఎం మండల మహా సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం కోరారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహా సభకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, కార్యదర్శివర్గ సభ్యుడు బట్టుపల్లి అనూరాధ, కల్లూరి మల్లేశం పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది నర్సింహ, మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

బొమ్మలరామారం : డీఎస్సీ 2024లో బీఈడీ అభ్యర్థుల తీవ్ర అన్యాయం జరిగిందని రాబోయే డీఎస్సీ ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కోరుతూ పలువురు బీఈడీ అభ్యర్థులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎస్జీటీ అభ్యర్థులకు స్కూల్ అసిస్టెంట్‌లలో ప్రమోషన్‌లు ఇవ్వడంతో ఎస్ఏ పోస్టులు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఈడీ అభ్యర్థులు ఎలబోయిన శ్రీహరి, మైలారం జంగయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.


ఎల్ఈడీ లైట్ల అందజేత



ఎల్ఈడీ లైట్లను అందజేస్తున్న నాయకులు

భువనగిరి రూరల్ : మండలంలోని హన్మాపురం గ్రామానికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నిధులతో మంజూరైన 40 ఎల్ఈడీ లైట్లను మంగళవారం ఆ పార్టీ నాయకులు పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు ధర్మారెడ్డి, రంగ మల్లేశ్ గౌడ్, గోమారి మహిపాల్ రెడ్డి, నాగపురి దేవేందర్, గోమారి ఎల్లారెడ్డి, రాపాక కష్ణ, తుమ్మేటి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ



పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ

అడ్డగూడూరు: మండలంలోని కోటమర్తి గ్రామ పంచాయతీ సిబ్బందికి మంగళవారం మాజీ ఎంపీటీసీ పాశం యాదమ్మ సత్యానారాయణ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిప్పలపల్లి బాలు, డైరెక్టర్ భిక్షం, సోమయ్య, శ్రీను, చంద్రమౌళి, లచ్చయ్య పాల్గొన్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ఇబ్బందులు

- రోడ్లకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత
- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు





పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

భువనగిరిటౌన్ : పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. రోడ్లకు ఇరువైపుల వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. భువనగిరి పట్టణం జిల్లా కేంద్రంగా మారిన నాటి నుంచి ప్రజల రాకపోకలు మరింత పెరిగిపోయాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం వివిధ మండలాలు, గ్రామాల ప్రజలతో పాటు యాదాద్రి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాల రాకపోకలతో పట్టణం నిత్యం రద్దీగా ఉంటుంది. కాగా పట్టణంలోని రోడ్లకు ఇరువైపుల ఉన్న షాపింగ్‌మాల్స్, వస్త్ర, కిరాణ దుకాణాల ఎదుట అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఫుట్ పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు..

పట్టణ కేంద్రంలోని రోడ్డుకు ఇరు వైపుల ఉన్న ఫుట్ పాత్‌ను ఆక్రమించి చిరు వ్యాపారులతో పాటు పెద్ద పెద్ద దుకాణ యజమానులు వ్యాపారాలు చేస్తున్నారు. దుకాణాలకు సంబంధించిన సామగ్రి ఫుట్ పాత్ పై ఉంచి వ్యాపారం సాగిస్తుండడం.. మరి కొందరైతే ఏకంగా రోడ్డుపైనే తోపుడు బండ్లు, పాన్‌డబ్బాలు, టీ స్టాల్‌లు, టీఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని బిజినెస్ చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలో ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ ఎక్కువ ఉండడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు

రోడ్లపై అడ్డగోలు వాహనాలు పార్కింగ్ చేస్తున్న పోలీసులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్, ట్రాఫిక్ పోలీసులు వాహనాలు సైరన్ వే సుకుంటూ రౌండ్స్ వేయడమే తప్పా ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో వచ్చే వాహనదారులను ఆపి జరిమానాలు వేయడం.. రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్ చేసే వారి వాహనాల ఫొటోలు తీయడానికే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు చొరవ తీసుకొని పట్టణంలో అడ్డగోలుగా వాహనాలను పార్క్ చేయకుండా చూడాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతుంది. ప్రధాన సెంటర్లలో రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. నిబంధనలు పాటించని వ్యాపారస్తులు, వాహనదారులపై తగు చర్యలు తీసుకుని పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నాం.

– శ్రీకాంత్, భువనగిరి

భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



ఆత్మకూరు(ఎం): అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ పి.రాములు, శంకరయ్య, కటకం రాజు, క్లెం రాజు, అయిలి సందీప్, రామచందర్, ఎండీ ఫయాజ్, నాగరాజు, సిద్దులు విష్ణు, పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ముదిరాజ్ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బుంగపట్ల యాకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, ఆత్మకూరు(ఎం) సీఐ సాల్మన్‌రాజు, ఎస్ఐ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి కందడి అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మోత్కూరు : పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రు అనిల్ ఆరోపించారు. మోత్కూరులో ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల భవనానికి అద్దె చెల్లించకపోవడంతో పాఠశాల గేటుకు భవన యజమాని తాళం వేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అద్దె బకాయిల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి గానీ పాఠశాల గేటుకు తాళాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను బయట నిలబెట్టిన భవన యజమాని తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



యాదగిరిగుట్ట రూరల్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రమేష్



మోటకొండూర్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ కొండల్‌రావు

యాదగిరిగుట్ట రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ అన్నారు. మండలంలోని బాహుపేట గ్రామంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే వాట్సాప్, ఎస్ఎమ్ఎస్‌లకు స్పందించొద్దన్నారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలన్నారు. యువతీ, యువకులు గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌తో పట్టుబడితే చట్టరిత్యా కఠినమైన కేసులు ఉంటాయని హెచ్చరించారు కార్యక్రమంలో ఎస్సైలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మోత్కూరు : సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని ఎస్ఐ డి.నాగరాజు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు తెన్నులను వివరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

మోటకొండూర్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని సీఐ కొండల్‌రావు అన్నారు. సీసీ కెమెరాల వినియోగంపై మంగళవారం మండల కేంద్రంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరగకుండా నియంత్రించొచ్చనన్నారు. అన్ని గ్రామాల్లో వీలైతే ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రగ్స్, బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పాండు, ఏఎస్ఐ లింగయ్య, కానిస్టేబుల్ సోమశేఖర్ పాల్గొన్నారు.

అన్ని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపుతాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మల్కాపూర్ కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను పరిశీలిస్తున్న విప్ బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం(తుర్కపల్లి) : ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపుతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నా రు. తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్ వద్ద గల కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎస్సారెస్పీ నుంచి మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్ట్ ద్వారా తుర్కపల్లి మండలంలోని వాసాల మర్రి, మల్కాపూర్, సంగ్యా తండాల మీదుగా వెంకటపూర్ గ్రామశివారులో గల తోక చెరువు మల్లాపూర్, సైదాపూర్, మాసాయిపేట మీదుగా పలు చెరువులలో గోదావరి జలాలతో నిండుతాయన్నారు. గొలుసుకట్టు కాల్వల ద్వారా ప్రతి చెరువును నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు(ఎం): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మొగులగాని అంజయ్య మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా కప్పి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, డైరెక్టర్ ఎగ్గిరి యాదగిరి, నోముల వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, మాజీ సర్పంచ్ సుబ్బురు వెంకటేశ్వర్లు, మండల నాయకులు తండ శ్రీశైలం, బత్తిని ఉప్పలయ్య, పాశం అనంతరెడ్డి, బాషబోయిన పాపయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారు

- డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



ఏసీపీ రమేష్‌కు ఫిర్యాదు అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు

యాదగిరిగుట్ట: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. మల్లాపురం గ్రామానికి చెందిన కర్రె చంద్రశేఖర్‌పై అక్రమ కేసులు పెట్టి, అతడి తండ్రి కర్రె ఐలయ్యను అర్ధరాత్రి సీఐ రమేష్ తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ మంగళవారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులతో కలిసిన ధర్నా చేశారు. అనంతరం సీఐ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏసీపీ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల పార్టీ కార్యాలయాలుగా మారాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడు ఏ ఒక్కరిని అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. ఏసీపీని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్ బూడిద సురేందర్, నాయకులు మిట్ట వెంకటయ్య, గునగంటి బాబురావుగౌడ్, శిఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరుకాని నిందితుడి అరెస్ట్

అడ్డగూడూరు: అత్యాచారయత్నం కేసులో జైలుకెళ్లి అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చి మూడేళ్ల నుంచి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అడ్డగూడూరు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన గోలి శంకర్ 2020లో వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేయగా బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించింది. జైలుకెళ్లిన అతడు కొద్దిరోజులకు బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టుకు గాని పోలీస్ స్టేషన్‌కు గాని హాజరుకాకుండా మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. శంకర్ హైదరాబాద్‌లో ఉన్నాడన్న పక్కా సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ రామనర్సయ్య, కానిస్టేబల్ రజనీకాంత్ మంగళవారం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వలిగొండ : మండలంలోని దుప్పెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకు న్న 2011 – 12 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, చండీ ప్రసాద్, హరి కృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి



రాజాపేట : సింగారంలో గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాజాపేట : పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు గోపిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సింగారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం చంద్రారెడ్డి, గోపాల మిత్రలు ఎస్ బాలకిషన్, బీ రామచంద్రం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల పశు వైద్యాధికారి డాక్టర్ యాకూబ్, విఏ ప్రవీణ్, గోపాల మిత్రలు గోవింద్, కిష్టయ్య, నరేష్, శ్రీను, శేఖర్, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా తప్పని సరిగా టీకాలు వేయించాలని ఆలేరు మండల పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య అన్నారు. మండలంలోని కొలనుపాక, శారాజీపేట గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ రెడ్డి, వీఎల్‌ఓ శ్రీనివాస్, సిబ్బంది రమ, వరలక్ష్మి, నర్సమ్మ, స్వామి, శ్రవణ్ పాల్గొన్నారు.

రామన్నపేట : మూగ జీవాల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు కె.జ్యోత్స్న, ఇందిర తెలిపారు. మంగళవారం ఇంద్రపాలనగరంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ సుభాషిని, వీఏ భాను, మౌనిక, గోపాలమిత్ర మల్లేష్, సురేష్, పాలసంఘం చైర్మెన్ సింగనబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్



నిరసన తెలుపుతున్న శ్రీ హిందూ కళాశాల అధ్యాపకులు

రామన్నపేట : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కళాశాలల నిరవధిక బంద్ కొనసాగుతోంది. రామన్నపేటలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాలను మంగళవారం బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.భాస్కర్‌రావు , అధ్యాపకులు వి.దేవేందర్‌రావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అడ్డగూడూరు : మండలంలోని చిన్నపడిశాలలోని బిక్కేరు వాగుపై ఉన్న చెక్‌డ్యాం లోకి గోదావరి జాలాలు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి జలాలకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలతో అడ్డగూడూరు, మోత్కూర్ మండలాలు సస్యశ్యామలమయ్యాయన్నారు. ఈ ప్రాంతంలోని సాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఎమ్మెల్యే మందుల సామేల్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తీగల గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీ పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య మాజీ సర్పంచ్ యేసురత్నం, భిక్షం రెడ్డి, భాస్కర్‌గౌడ్, రామనర్సయ్య, నవీన్, కృష్ణ, పాపయ్య, మల్లేష్, కృష్ణ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ కడకంచి మల్లయ్య మృతి

ఆత్మకూరు(ఎం): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కడకంచి మల్లయ్య అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిలు మంగళవారం మల్లయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మామిడి కిష్టయ్యకు నివాళి

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన మామిడి కిష్టయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని పలువురు నాయకులు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి, తెప్పల రాయప్ప, ఎండీ.సాజిద్ పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

మునుగోడు: బీజేపీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం మునుగోడులో పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, మాదగోని నరేందర్ గౌడ్, అక్కెనపల్లి సతీష్, బ్రహ్మచారి, యాదయ్య పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించిన వారిని శిక్షించాలి

భువనగిరి క్రైమ్ : మండలంలోని వడాయిగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించిన వారిని శిక్షించాలని కోరుతూ పలువురు ఎమ్మార్పీస్ నాయకులు మంగళవారం రూరల్ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కోట యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు కోట స్వామి దాసు, చంద్రశేఖర్, కోట సుధాకర్, భిక్షపతి, గొరయ్య, పెద్ద రామచందర్, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

అర్ధశతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాకూర్ ఆడిటోరియంలో ఈ నెల 24న నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాల మహా సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగుడాల శివ కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మహా సభకు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు అర్ధశతాబ్ది ఉత్సవాల సభకు మేధావులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వినయ్, కార్తీక్, కిరణ్, మధు, ప్రసన్న, రాకేశ్, పల్లవి, నందిని, వర్షిత, శరత్, చంద్ర, సురేశ్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో దళితుల భూములు కబ్జా

భువనగిరి రూరల్: యాదగిరిగుట్ట అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం దళితుల భూములను అన్యాయంగా కబ్జాకు గురిచేసిందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం ఆదేశాల మేరకు ఆయన జిల్లా నాయకులతో కలిసి మంగళవారం డీసీపీ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం కింద ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కొండాపురం గణేష్, భాస్కర్, భిక్షపతి, నరేష్ పలువురు నాయకులు తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు కోరుకొప్పుల సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. మంగళవారం కేహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల మత్స్యగిరి, కూరెల్ల నాగయ్య, ఉప్పల నాగరాజు, ఎల్లంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట సాగుపై రైతులకు అవగాహన

అడ్డగూడూరు : రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆలేరు ఏడీఏ పద్మావతి పలువురు రైతు లతో పాల్గొని వీక్షించారు. అనంతరం రైతులకు శనగపంటపై అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో వేసే శనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ పాండురంగాచారి, ఏఈఓలు దయాకర్, నవనీత, అక్షర పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏడీఏ పద్మావతి